క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలుతో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణ మాజీ కౌన్సిలర్ సిద్దిరెడ్డి అప్పారావు రూ. 4 వేలు విలువైన పుస్తకాలను విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, పోతుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం


బాధితురాలి కుటుంబ సభ్యులకు మందులు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న దిగుమర్ల పార్వతి అనే మహిళకు వాకర్స్ క్లబ్ సభ్యులు మందులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ కోనసీమ అంబేడ్కర్ జిల్లా మలికిపురం మండలం బట్టేలంక గ్రామానికి చెందిన పార్వతి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను పిలిచి 3 నెలలకు సరిపడ్డా మందులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ షేక్ పీర్ సాహెబ్, కోశాదికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు పాల్గొన్నారు.

చింతపర్రులో ఫ్యామిలీ ఫిజీషియన్


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని లంకలకోడేరు మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని నిర్వహించి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి ఆరోగ్య సలహాలు అందజేశారు. సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు, ఎంపీహెచ్‌ఈవో కె.ప్రభాకర్, ఏఎన్‌ఎం టి.అనిత పాల్గొన్నారు.

జంతువులను సంరక్షించాలి

సాక్షి, భీమవరం: పశువుల్లో అంతుబట్టని వ్యాధులు వస్తుంటాయని జంతువులను సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జె.మురళీకృష్ణ అన్నారు. బుధవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో జంతువులపై అవగాహన, వ్యాధులు నివారణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్) ఎక్కువగా కన్పిస్తోందని ఈ వ్యాధి తెల్ల జాతి పశువులలో అతి వేగంగా వ్యాప్తిస్తుందన్నారు. పశు వైద్యుల సూచనలతో చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్ శాంతకుమారి, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఏడీ కె.సత్యనారయణ, కళాశాల జువాలజీ హెడ్ డాక్టర్ ఉషారాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

భీమవరం అర్బన్: వ్యవసాయాధారిత గ్రామాలలో దాళ్వాకు సంబంధించి 4 పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నట్లు ఏఎస్‌ఓ రాజు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకే సెంటర్లో బుధవారం పంట కోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో రాజు, ఏవో నిమ్మల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సర్వే నెం, సబ్ డివిజన్ ఆధారంగా పంట కోత ప్రయోగాలు ఏ విధంగా చేయాలో? వివరించారు. అలాగే మండలంలో 16 వ్యవసాయాధారిత గ్రామాలలో ఒక్కో గ్రామంలో4 పంట కోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. దాళ్వాకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకోవాలని కోరారు. పలు వ్యవసాయా కార్యక్రమాలు గురించి ఈ శిక్షణ తరగతులలో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ రామలింగేశ్వరరావు, బాల, కాశీమాత తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే విజయ సారథులు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సంక్షేమపథకాల అమలుకు గృహసారథులను నియమించారని, వారే రాబోయే ఎన్నికల్లో విజయసారథులుగా సారథ్యం వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండలో పెనుగొండ, వడలి, వెంకట్రామపురం, దేవ, తామరాడ, కొఠాలపర్రు, మునమర్రు, సోమరాజు చెరువులకు చెందిన వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుకు శిక్షణా సమావేశం నిర్వహించారు. నాడు జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు, ఆయన అనుచరులు దోచుకు తింటే, నేడు సీఎం జగన్ ఆత్మ బంధువులు వలంటీర్లతో పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. మరింత మందికి సంక్షేమం అందించడానికి ప్రతీ 25 ఇళ్లకు గృహసారథిని నియమించారన్నారు. వీరు నిత్యం వారితో సాన్నిహిత్యంగా ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు.ప్రజల న మ్మకమే సీఎం జగన్ అని, మరింత అండగా నిలిచి సీఎం జగన్ లక్ష్యమైన 175 నియోజకవర్గాల్లో విజయాన్ని అందించాలని కోరారు. ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టని తరువాత మహిళలకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారన్నారు. వలంటీర్ల దగ్గర నుంచి స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లోనూ సగానికి పైగా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వలంటీర్లు, గృహసారథులే సీఎం జగన్ కుటుంబ సభ్యులన్నారు. సమావేశంలో పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ వెలగల వెంకట రమణ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పెనుగొండ ఉప సర్పంచ్ ఆకేశెట్టి వరలక్ష్మీ, సర్పంచ్‌లో నల్లూరి సత్యనారాయణ, మాకినీడి సత్యనారాయణ, దంపనబోయిన రూప,మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, సాక సుబ్రహ్మణ్యం, బాలం సత్తిరాజు, బళ్ల బద్రీ, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండలో గృహసారథుల శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

చంద్రబాబుది ప్రచారార్భాటం

పెనుగొండ: ప్రచారార్భాటంతో చంద్రబాబు ప్రజలను చంపేశారని, అయినా నేటికీ ప్రచారార్భటం మానడం లేదని ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం సిద్ధాంతంలో దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, ఇలపర్రు, ములపర్రు, రామన్నపాలెంకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు శిక్షణా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో సేవలందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనరు సాక సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, సర్పంచ్‌లు యర్రంశెట్టి బుజ్జి, కడలి బేబీ అన్నపూర్ణ, పార్టీ నాయకులు సరేళ్ల లాజరస్, దంపనబోయిన బాబూరావు, జుత్తిగ బాలయ్య, కేశవరపు గణపతి, పెచ్చెట్టి జేమ్స్, గుత్తుల రాముడు, బలువు కృష్ణమూర్తి, పురిళ్ల శ్రీను, దామోదర్, డీఆర్‌సీ రాజు, వేండ్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సిద్ధాంతంలో గృహ సారథుల శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న షర్మిలారెడ్డి

పేదలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న సత్రం చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంతాల నుంచి పాలకొల్లు ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం అన్నదానం చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్ అన్నారు. సత్రం వ్యవస్థాపకురాలు మన్యం జగ్గమ్మ వర్ధంతి సందర్భంగా సత్రం వద్ద బుధవారం 200 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.50 లక్షలతో సత్రం భవనాన్ని ఆధునికీకరణ చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. కార్యక్రమంలో సత్రం ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్టీలు కడలి రామలక్ష్మి, క్రొవ్విడి సూర్యనారాయణ, గొర్రెల వెంకటలక్ష్మి, గొర్రెల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించాలి

జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి వివరిస్తూ భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పాలని జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం సగంచెరువు, లంకలకోడేరు, శివదేవునిచిక్కాల గ్రామ సచివాలయాల వద్ద బుధవారం గృహ సారథులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఇంటికీ రూ.2లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి చేకూరిన విషయాన్ని గృహ సారథులు లబ్ధిదారులకు వివరించి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ వైఎస్సార్ సీపీ కార్యకర్త కాలర్ ఎగరేసుకుని చెప్పుకోవాలన్నారు. అవినీతికి, అక్రమాలకు అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ లబ్ధిని అందించడం చారిత్రాత్మకమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలా వలంటీర్లు పని చేస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు వలంటీర్ల సేవలతో సమాధానం ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు. పార్టీలకు అతీతంగా పథకాలను లబ్ధిదారులకు అందించాలని వివరించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో రూ.1.92 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందించారన్నారు. చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, మండల గృహ సారథుల కన్వీనర్ పార్శి వెంకటరత్నం, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, సర్పంచ్‌లు గుమ్మాపు పెద్దిరాజు, కడలి నాగమణి, రాపాక నగేష్ కరుణాకర్, మండెల పావని, కెల్లా సింహాచలం, గంటా సత్యనారాయణ, దిడ్ల మణివజ్రం, పెన్మెత్స ఏసురాజు, యాండ్ర సింహాచలం, ఎంపీటీసీలు పెదపాటి వెంకటరత్నం, చింతపల్లి సాయిబాబా, మేడిది స్వర్ణ, తండా ఇస్సాక్, పార్టీ నాయకులు కుక్కల శ్రీనివాస్, కర్రి జోగయ్య, ఆకుల నాగమురళి, ఏనుగుపల్లి చంద్రశేఖర్, మడికి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


లంకలకోడేరులో సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ఊపందుకున్న ఉపాధి పనులు


రామన్నపాలెంలో పంటబోదె తవ్వుతున్న కూలీలు


మల్లవరంలంక గ్రామంలో చెరువును తవ్వుతున్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల్లో పంటబోదెలతో పాటు డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో పేరుకుపోయని గుర్రపు డెక్కను, మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు. బుధవారం సుమారు 450 మందికి పనులు కల్పించామని అంతేకాక ప్రధాన రహదారులకిరువైపులా మొక్కలు నాటే పనులు కూడా చేపడుతున్నామని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలో ఉపాధి హామీ పనులు వేగంగా జరుగుతున్నాయని టెక్నికల్ అసిస్టెంట్ వీరా సుదర్శనకుమార్ ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. బుధవారం మండలంలో 25 గ్రామాల్లో 980 మంది కూలీలు పని చేశారన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలకు సకాలంలో వేతనాలను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం చెరువులు, పంట కాలువల తవ్వకం పనిచేస్తున్నారు. 2023–2024 సంవత్సరానికి జరుగబోయే పనులకు సంబంధించి చేపట్టాల్సిన కొత్తపనులను గుర్తించే పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పని కావాల్సిన వారు నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

యలమంచిలి: వరదలు, తుఫాన్‌లు, అగ్నిప్రమాదాలు, భూకంపం వంటి ప్రకృతి విపత్తుల సమయంలోను రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ (విజయవాడ) సత్యనారాయణ కోరారు. విపత్తుల సమయంలో మనల్ని మనం రక్షించుకోవడంతోపాటు, ఇతరులను కూడా ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ బుధవారం కనకాయలంక గ్రామంలోని పుష్కరాల రేవులో జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. లంక గ్రామాలలో విరివిగా దొరికే ఎండు కొబ్బరికాయలు, ఖాళీ వాటర్ బాటిల్స్‌తో లైఫ్ జాకెట్స్ ఏ విధంగా తయారుచేయాలో వివరించారు. నీటిలో మునిగిన వ్యక్తికి ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో చూపించారు. గ్యాస్ బండ లీకైతే ఏ విధంగా అరికట్టవచ్చునో మహిళలకు వివరించి, అనంతరం మహిళలతో లీకైన గ్యాస్ బండను ఆర్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది 13 మంది, అగ్ని ప్రమాద అధికారులు ఆరుగురు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్కు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కనకాయలంకలో ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రోటరీ సేవలు అభినందనీయం

మొగల్తూరు: రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ పడవల మేరీ అన్నారు. బుధవారం మొగల్తూరులోని అందే బాపన్న, కోట్ల రంగరావు కాలేజీలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోటరీ క్లబ్ ఉచిత సేవలు అందించాలని సూచించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు 250 మందిని రీక్షించి 72 మందికి కళ్లజోల్లు అందించగా, 16 మందికి ఆపరేషన్లు చేయాలని గుర్తించారు. రీజనల్ రోటరీ ఫౌండేషన్ ఛైర్మన్ కోట్ల రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ, కార్యదర్శి సీహెచ్ పార్థసారథి, ట్రెజరర్ సీహెచ్ నాగు, తోట శ్రీనివాస్ బాబు,పోతాబత్తుల బాలకృష్ణ, తోట శ్రీధర్, కనకం ప్రసాద్, కాళంగి శాస్త్రి, కారిచర్ల ఆదినారాయణ, పడవల సత్యనారాయణ, రాయుడు లక్ష్మణరావు, అనసూయ, భవాని, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మొగల్తూరులో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ మేరీ

డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పాలకొల్లు అర్బన్: డప్పు కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన డప్పు కళాకారుల జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత డప్పు కళాకారులు తీన్మార్ వాయిస్తే ప్రభుత్వాలు దిగిరావాలన్నారు. సమస్యలు పరిష్కరించుకోవడం కోసం కళాకారులు సమైక్యంగా ఉద్యమాలు చేయాలని శ్రీనివాసు పిలుపునిచ్చారు. ప్రతీ డప్పు కళాకారుడికి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.లాల్‌సన్, దళిత కవి కోలాటి చిన పెద్దిరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్, సీహెచ్ సుందర్, దిద్దే నాగేశ్వరరావు, శెట్టిమి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


డప్పు కళాకారుల జిల్లా సదస్సులో పాల్గొన్న రాష్ట్ర నాయకులు

హెల్మెట్‌ధారణపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: మోటర్ వాహనాలపై హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పట్టణ ఎస్సై భాదం శ్రీనివాసు తెలిపారు. బుధవారం పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్ వద్ద హెల్మెట్ లేని వాహనదారులను ఆపి తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం హెల్మెట్ లేని వాహనదారులకు హెల్మెట్‌లు పెట్టుకోవాలని సూచించామన్నారు. ఏ వాహనదారునికి ఎలాంటి ఫైన్‌లు రాయడంలేదని వారికి కౌన్సెలింగ్ ఇస్తూ హెల్మెట్‌లు కొనుగోలు చేసుకుని వచ్చి తమ వాహనాలు తీసుకు వెళ్లాలని చెప్పామన్నారు. వాహనదారులకు కొద్దిగా ఇబ్బంది అనిపించినా వారి ప్రాణాలతో పాటు ఆ కుటుంబం రక్షణకోసమే ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఎస్సైలు మద్దాల శివాజీ, మార్‌లింగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ పెట్టుకోమని వాహనదారుడికి దండం పెట్టి చెబుతున్న ఎస్సై శ్రీనివాస్

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

సాక్షి, భీమవరం: పట్టణంలో ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టుటౌన్ ఎస్సై పి.అప్పారావు చెప్పారు. టుటౌన్ ప్రాంతంలోని ఏఎస్‌ఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కె.రాజన్‌రాజు (78) అవివాహితుడు. కొంతకాలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తన ఫ్లాట్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూనపరాజు వెంకట్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉరి వేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈలంపూడి గ్రామానికి చెందిన మైనపు జానకి రామయ్య (73) మానసిక ఆరోగ్య పరిస్థితి బాగోలేక గత నెల 28న ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకోబోగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో జానకిరామయ్య చికిత్స పొందుతుండగా మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఆస్పత్రికి తరలించారు. బుధవారం జానకి రామయ్య చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన కుమారుడు మైనపు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని రజక వీధిలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 3,380లు, రెండు కోడి కత్తులు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మాల మహానాడు కార్యాలయం ఏర్పాటు

పెనుగొండ: ఆచంట వేమవరంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన మాల మహానాడు కార్యాలయాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మాల మహానాడు కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

జగనన్న కాలనీ రోడ్డు పనులు ప్రారంభం


మేడపాడు జగనన్న కాలనీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ

యలమంచిలి: జగనన్న కాలనీలో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ చెప్పారు. ఓటీఎస్ నిధులు రూ.4.50 లక్షలతో మేడపాడు గ్రామంలోని దూడే వారి పుంతలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఈ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. త్వరలోనే కుళాయిలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో రోడ్డు పని పూర్తవుతుందన్నారు. కనుక లబ్ధిదారులు కూడా స్పందించి వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల రామ్మోహనరావు, దేగల వెంకటేశ్వరరావు, బాలం అంజిబాబు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు అందించాలి


చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: చిన్నారులకు టీకాలు సకాలంలో వేసి వ్యాధుల నుంచి కాపాడాలని సర్పంచ్ దిడ్ల మణివజ్రం అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పోలియో, బీసీజీ, డీపీటీ, హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌లు చిన్నారులకు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో ఆధార్ ప్రత్యేక క్యాంపు

కాళ్ల: మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఏఓ ఎంఎస్ ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ క్యాంపులో సచివాలయం ద్వారా ఆధార్ సేవలు, ఆధార్ మొబైల్ నెంబర్ లింకు, ఈ–మెయిల్ లింకు, బయోమెట్రిక్, పుట్టినరోజు, పేరు మార్పు, ఆధార్ అప్డేట్, చిరునామా మార్పులు చేస్తారన్నారు. అదేవిధంగా కొత్త ఆధార్ కార్డు కూడా నమోదు నమోదు చేసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. 8న కాళ్ల 2, 9న ఏలూరుపాడు 1, 10న ఏలూరుపాడు 2 లో మూడు రోజులు పాటు క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్య అదృశ్యమైందని భర్త ఫిర్యాదు

ఉండి: మండలంలోని ఉణుదుర్రులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన భార్య అదృశ్యమైనట్లు ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండగండి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 26 ఏళ్ళ తన భార్యతో కలిసి ఉణుదుర్రులో నివాసం ఉంటున్నాడు. మంగళవారం యథావిధిగా ఉద్యోగ నిమిత్తం వెళ్ళివచ్చేసరికి ఇంటివద్ద తన భార్య కనబడకపోవడంతో చుట్టుపక్కల వెదికినా ఆమె జాడ కనిపించలేదు. దీంతో బుధవారం పోలీసులను ఆశ్రయించాడు.